సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తా

ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

దుండిగల్: సమస్యల పరిష్కారానికి తన నిధులను కేటాయిస్తానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని వార్డుల్లో డ్రైనేజీకి రూ.4.46 కోట్లు, సీసీ రోడ్లకు రూ.10.93 కోట్లు, గ్రేవ్ యార్డ్లకు రూ.1.82 కోట్లు, కమ్యూనిటీ హాళ్లకు రూ.1.40 కోట్లు మొత్తం కలిపి రూ.18 కోట్లకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పద్మారావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్, మేనేజర్ సునంద, ఏఈ సురేందర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: ఆటలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ధ్యాన్‌చంద్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని టీవీఆర్ పాఠశాలల అకాడమిక్ డైరెక్టర్ టి.వంశీ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం జీడిమెట్లలోని టీవీఆర్, సత్యవాణి పాఠశాలల ఆధ్వర్యంలో హాకీ ప్లేయర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని ఎస్.ఆర్.నాయక్‌నగర్ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వరదనీరు సాఫీగా వెళ్లేలా..

- ముమ్మరంగా డ్రెయిన్ వాటర్ పైపులైన్ నిర్మాణం
- రూ.1.65 కోట్ల నిధులతో పనులు
- శాశ్వత పరిష్కారం దిశగా అధికారుల ప్రణాళికలు


సీఐఈ గాంధీనగర్ పరిధిలోని ఓ వీధిలో పూర్తైన పైపులైన్ నిర్మాణం

రంగారెడ్డినగర్: వర్షాకాలంలో ప్రధాన రోడ్లపై వరద నీరు చేరడం, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడం షరామాములుగా మారింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఐలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి వరదనీరు సజావుగా వెళ్లేందుకు డ్రెయిన్ వాటర్ పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సీఐఈ గాంధీనగర్ ప్రాంతంలో రూ.1.65 కోట్ల నిధులు వెచ్చించి చేపడుతున్న ఎస్‌పీ–4 డ్రెయిన్ వాటర్ పైపులైన్ వ్యవస్థ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఐలా పరిధిలోని ప్రధాన రోడ్లపై వరదనీరు చేరడంతో వాహనదారులతో పాటు సమీప పరిశ్రమల కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో చేపడుతున్న పైపులైన్ పనులు పూర్తైతే వరదనీరు సాఫీగా వెళ్లేలా అవకాశం ఉంటుంది.

డ్రెయిన్ వాటర్ పైపులైన్ నిర్మాణ ప్రాంతాలు

◆ ఐడీపీఎల్– జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని ఎర్ర గోడల నుంచి గిరినగర్ అమ్మవారి ఆలయం వరకు, ప్లాట్ నెంబరు 113 నుంచి 87(నీలు ఇండస్ట్రీస్ నుంచి ఎస్వీ ఎంటర్‌ప్రైజెస్ వరకు), ప్లాట్ నెంబరు 58 నుంచి 61 (మెక్ కాంపోనెంట్స్ నుంచి గ్రీన్ అక్వా ప్రైవేట్ లిమిటెడ్ వరకు), ప్లాట్ నెంబరు 61(గ్రీన్ అక్వా కంపెనీ నుంచి కవిత ఎయిర్ ఎక్విప్‌మెంట్ సిస్టం వరకు), ప్లాట్ నెంబరు 22 నుంచి 28 (ఎంఎంకే ఆఫ్‌సెట్ ప్రింటర్స్ నుంచి ఈశ్వర్‌సింగ్ కంపెనీ వరకు) సీఐఈ గాంధీనగర్ పారిశ్రామికవాడ పరిధిలో వాటర్‌డ్రెయిన్ పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు మధ్య మధ్యలో వరదనీరు పైపులైన్‌ల గుండా వెళ్లేందుకు మ్యాన్‌హోళ్లకు జాలీలను ఏర్పాటు చేయనున్నారు.

వరద నీటి నిల్వకు చెక్

◆ సీఐఈ గాంధీనగర్ పరిధిలోని గాంధీనగర్, సంజయ్‌గాంధీ నగర్ రోడ్డు, అదే విధంగా ఐడీపీఎల్– జగద్గిరిగుట్ట రోడ్డులోని రంగారెడ్డి నగర్ స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో వర్షం పడ్డ ప్రతిసారి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. రోజుల తరబడి రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. డ్రెయిన్ వాటర్ భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ పూర్తయితే ఈ ప్రాంతాల్లో వరదనీరు నిలిచే అవకాశం ఉండదు.

రోడ్లపై ఇష్టానుసారంగా పైపులు

డ్రెయిన్ వాటర్ భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా రోడ్లపై భారీ పైపులను వేయడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా ఐడీపీఎల్– జగద్గిరిగుట్ట రోడ్డు పక్కనే పైపులు వేయడంతో ప్రమాదవశాత్తు అవి జారి రోడ్డుపైకి వస్తే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశముంది. అదే విధంగా వివిధ పరిశ్రమల ముందు పైపులు ఒకదానిపై మరొకటి పేర్చి అమర్చారు. వాటి ముందు రాడ్లు ఏర్పాటు చేస్తే జారే అకాశముండదు. భూగర్భ పైపులైన్‌లు జరుగుతున్న ప్రాంతాల్లో బారికేడ్‌లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. అసలే వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో వరదనీటిలో గోతులను గమనించక వాటిలో పాదచారులు, వాహనదారులు పడే ప్రమాదం ఉంది. సంబంధిత ఐలా అధికారులు పనులు జరిగే ప్రాంతాలను సందర్శించి రక్షణ ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలని సమీప బస్తీల వాసులు కోరుతున్నారు.


పైపులైన్ పనుల ప్రాంతంలో బారికేడ్‌లు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం


వివేకానంద విగ్రహం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న పైపులు

నూతన ఆలోచనతో ముందుకెళ్లాలి


కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

నిజాంపేట్: విద్యార్థులు మారుతున్న కాలానికనుగుణంగా నూతన ఆలోచన విధానంతో ముందుకెళ్లాలని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల చైర్మన్ సురేశ్‌బాబు అన్నారు. బాచుపల్లిలోని కళాశాలలో గురువారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రధాన కార్యదర్శి జె.ఎస్.రావు, ఉపాధ్యక్షుడు దుర్గాప్రసాద్, సంయుక్త కార్యదర్శి అమృత రామప్రసాద్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్య అంటే కేవలం కోడింగ్, ప్రోగ్రామింగ్ కాదని, రోజువారి జీవితాల్లో తలెత్తే సమస్యలకు పరిష్కార మార్గాలు, భవిష్యత్ ప్రపంచ అవసరాలకు తగ్గట్టుగా నూతన ఆవిష్కరణలతో ముందుకెళ్లాలన్నారు. అంకుర సంస్థల స్థాపనకు విద్యార్థులకు రూ.5 లక్షల పెట్టుబడి అందిస్తున్నామని, విదేశీ విద్యాలయాలతో సైతం ఒప్పందాలు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, డీన్ ఆచార్య అనురాధ, కళాశాల ప్రధానాధ్యాపకుడు డాక్టర్ సీడీ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేశ్‌బాబు

గుంతలమయంగా రోడ్డు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల మయంగా మారింది. స్థానికంగా ఉన్న కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ గుంట ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలో ఇరుక్కున్న కారును బయటకు తీపిస్తున్న తోటి వాహనదారులు

రేపు ప్రత్యేక పూజలు

సుభాష్‌నగర్: గాజులరామారం మెట్‌కానిగూడలోని నల్లగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 7 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, 10 గంటలకు మహాయాగం, సాయంత్రం 5 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని వివరించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సుభాష్‌నగర్: తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ అన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నేటి యువత ఆయన గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ హరి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 9959226151 ఫోన్ నెంబర్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి


అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్

కుత్బుల్లాపూర్: వినాయక నవరాత్రోత్సవాలతో పాటు నిమజ్జనాలు సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. గురువారం నిమజ్జన ఏర్పాట్లపై కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాల ఏర్పాటు మొదలు నిమజ్జనాలకు తరలించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువుల వద్ద విగ్రహాల నిమజ్జనాలను ఆయా విభాగాల అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, పారిశుద్ధ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించి రాకపోకలకు ఆటంకం కలుగకుండా సహకరించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. గురువారం సుచిత్ర చౌరస్తా, కొంపల్లి– బొల్లారం చౌరస్తాల్లో రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 24 వాహనాలను సీజ్ చేశారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాంగ్‌రూట్ డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. లేకుంటే భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


పట్టుబడ్డ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు

ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌కు వినతి

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలో కనుమరుగవుతున్న చెరువులు, నాలాలను పరిరక్షించేందుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలనలో స్థానిక ప్రజాప్రతినిధుల అండతో నియోజకవర్గంలో అక్రమ కట్టడాలకు అడ్డూ, అదుపు లేకుండా పోయిందన్నారు. ఆ ఆక్రమణల్లో భీమునికుంట, కాముని చెరువు, రంగధాముని కుంట, సున్నం చెరువు, పరికి చెరువు, నల్ల చెరువు, మైసమ్మ చెరువు, ముళ్లకత్వ చెరువులు కూడా ఉన్నాయని వివరించారు. కైత్లాపూర్ కుంట, ఖాజా కుంట, కూకట్‌పల్లిలో నాలాల సంఖ్య, బాలానగర్‌లో 150 అడుగులు ఉన్న నాలాని పూడ్చి 40 అడుగులు చేశారని ఆరోపించారు. బోయిన్‌పల్లి వద్ద బోయిన్ చెరువులు, నాలాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయని, మైసమ్మ చెరువు, రంగనాయక చెరువు సుందరీకరణ పేరుతో కబ్జా చేశారన్నారు.


హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యం శ్రీరంగం

విద్యార్థులకు ఆటల పోటీలు


మ్యూజికల్స్ చైర్ ఆడుతున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం చింతల్ వేంకటేశ్వర నగర్‌లోని బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడలను పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి ప్రారంభించారు. క్యారమ్స్, చెస్, బాల్ పాసింగ్, రింగ్స్ బ్యాలెన్సింగ్, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు సంధ్య, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న కాలనీ వాసులు

దుండిగల్: నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు తన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అవార్డు

రాయదుర్గం: ఇద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ప్రతినిధులు ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. 'హర్ గోవింద్ ఖోరానా ఇన్నోవేటివ్ యంగ్ బయోటెక్నాలజిస్ట్ అవార్డును హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎం శ్యామ్‌లాల్, ప్రొఫెసర్ డాక్టర్ మంజరి కిరణ్‌లు ఈ అవార్డును అందుకున్నారు. యానిమల్ బయాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం శ్యామ్‌లాల్, హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని సిస్టమ్స్ అండ్ కంప్యూటేషనల్ బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మంజరి కిరణ్‌లకు ఈ అవార్డు పొందారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కూకట్‌పల్లి: అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి గురువారం వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో రంగధాముని చెరువు వద్ద 7 క్రేనులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రిసిటీ వారు ఎటువంటి ఆటంకాలు లేకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నిమజ్జన సమయంలో వాహనాల పార్కింగ్ కోసం ప్రైవేట్ స్థల యజమానులతో మాట్లాడి పార్కింగ్‌కు స్థలాన్ని ఇప్పించే ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శానిటేషన్ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు శానిటేషన్‌పై పర్యవేక్షణ చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్‌లు సబిహా బేగం, మహేందర్, అధికారులు పాల్గొన్నారు.

అనుమతులు లేని డెర్మటాలజీ క్లినిక్ సీజ్

కేపీహెచ్ బీ కాలనీ : అనుమతులు లేకుండా కొనసాగుతున్న డెర్మటాలజీ క్లినిక్ సెంటర్ ను అధికారులు గురువారం రాత్రి సీజ్ చేశారు. కేపీహెచ్ బీ కాలనీ 5వ ఫేజ్ లో బ్రాండ్ ఫ్యాక్టరీ సమీపంలో సూర్య ఎలైట్ మూడవ ఫ్లోర్‌లో అనుమతులకు విరుద్ధంగా నడుస్తున్న డాక్టర్ సుగుణస్ ప్రీమియర్ డెర్మటాలజీ క్లినిక్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి సీజ్ చేశారు. 11 నెలలుగా ఎటువంటి పత్రాలు లేకుండా చికిత్స చేస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ పత్రాల గురించి ఆరా తీయగా.. ఫేక్ డాక్యుమెంట్ ను చూపించడంతో అధికారులు సీజ్ చేశారు. వైద్యాధికారులతో స్థానిక పోలీసులు ఉన్నారు.

కోర్టు ఆర్డర్ ధిక్కరించి..
రోడ్డు నిర్మాణం చేపట్టి.!


స్థలాన్ని పరిశీలిస్తున్న రంగనాథ్(ఫైల్)

- ప్రభుత్వ స్థలంలో రోడ్డు నిర్మాణం చేపడుతున్న అధికారులు
- అవసరం లేకున్నా నిర్మించడంలో ఆంతర్యం ఏమిటంటున్న స్థానికులు
- అధికారులు, కబ్జాదారులు కుమ్మక్కయ్యారంటూ ఆగ్రహం


జన సంచారం లేని ప్రాంతంలో రోడ్డు వేసేందుకు అని చదును చేసిన దృశ్యం

చింతల్: ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన అధికారులే కబ్జాదారులతో కుమ్మక్కై ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ జేబులు నింపుకుంటున్నారని భగత్‌సింగ్‌నగర్ వాసులు ఆరోపిస్తున్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలం 3550 గజాల స్థలానికి రెండు నెలల క్రితం ఫెన్సింగ్ వేసి స్థలాన్ని కాపాడాలని ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో కొంత మంది ఈ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయాలని చూసిన వారిపై 'సాక్షి'పత్రికలో కథనాలు ప్రచురితం కావడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడ నిర్మించిన బేస్మెంట్‌తో పాటు పాత ఫెన్సింగ్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దన్నారు.

జీహెచ్‌ఎంసీ అధికారుల కోర్టు ధిక్కరణ.!

భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి ఆదేశాలతో చేపట్టిన అక్రమ బేస్మెంట్ నిర్మాణంలో ఉండగా హైకోర్టు 3500 గజాలకు ఫెన్సింగ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు జన సంచారం లేని ప్రాంతంలో రోడ్డు వేసేందుకు ప్రణాళికలు రూపొందించి రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ స్థలం ధోబీఘాట్‌కు స్టార్‌లైట్ వెనకాల మధ్య భాగంలో స్థలం ఉండటంతో బస్తీలకు దారి అంటూ సగం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు.

ఫెన్సింగ్ వేయాల్సింది మరిచిపోయారు..

ఈ రోడ్డు సైతం కోర్టు ఆర్డర్ ప్రకారం ఉండగా ఇటీవల డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో పాటు ఇంజినీరింగ్ అధికారులు కబ్జాదారులకు అనుకూలంగా ప్రణాళికల రూపొందించి రోడ్డు వేసేందుకు ఉపక్రమించారు. కోర్టు ఆర్డర్స్ ప్రకారం 3500 గజాలకు ఫెన్సింగ్ వేయాల్సింది మరిచిపోయారు. ఇక్కడ రోడ్డు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందనేది జీహెచ్‌ఎంసీ అధికారులకే తెలియాలి. కాగా భగత్‌సింగ్‌నగర్‌లో అనేక ఖాళీలలో సీసీరోడ్డు పనులు నిలిచిపోగా ఇక్కడ మాత్రం ఎందుకు వేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు

వైభవంగా శ్రీవారి కల్యాణం

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ వేంకటేశ్వర్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం శ్రీవారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


పూజలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు